క్లుప్తంగా

బాల్య వివాహాలు చేస్తే చర్యలు తప్పవు



మాట్లాడుతున్న సీడీపీఓ వనజ అక్కమ్మ

శెట్టూరు: బాల్య వివాహాలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఐసీడీఎస్ సీడీపీఓ వనజా అక్కమ్మ అన్నారు. శనివారం లక్ష్మంపల్లి ఉన్నత పాఠశాలలో బాల్యవివాహాల వల్ల జరిగే నష్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్, ఆర్డీటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఈశ్వరయ్య శెట్టి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రఘురాంరావు, ఎస్‌ఐ రాంభూపాల్, ఎంఈఓ శ్రీధర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధమ్మ, ఆర్డీటీ టీం లీడర్ ఆదినారాయణ, పంచాయతీ కార్యదర్శి బొమ్మశంక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాణ్యమైన మాంసాన్ని విక్రయించాలి



మాంసం వ్యాపారులతో మాట్లాడుతున్న పశుసంవర్ధకశాఖ ఏడీ పెద్దన్న

ఉరవకొండ: రోగాలు సోకి, చనిపోయిన గొర్రెలు, పొట్టేలు మాంసం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ పెద్దన్న హెచ్చరించారు. శనివారం స్థానిక గవిమఠం ఆవరణలో ఉన్న మటన్, చికెన్ మార్కెట్‌ను పశుసంవర్ధక శాఖ అధికారులు పరిశీలించారు. ఏడీ మాట్లాడుతూ వినియోగదారులను మోసగించి వారికి నాసిరకం మాంసం విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మార్కెట్‌ను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో మేజర్ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు గుండ్లపల్లి విద్యార్థి



విద్యార్థి రవితేజను అభినందిస్తున్న హెచ్‌ఎం శేషగిరి

బెళుగుప్ప: గుండ్లపల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి విద్యార్థి రవితేజ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయినట్లు హెచ్‌ఎం శేషగిరి, పీఈటీ రాఘవేంద్ర శనివారం తెలిపారు. అనంతపురంలో శుక్రవారం జరిగిన స్కూల్‌గేమ్స్‌లో వాలీబాల్ పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభతో రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపికయినట్లు తెలిపారు. రవితేజను ఉపాధ్యాయులు నాగభూషణ, గోవర్ధన్ గిరిధర్, షాజహాన్, రామ్‌మోహన్‌రెడ్డి, నరసింహులు అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన చిన్నహోతూరు విద్యార్థులు



పోటీలకు ఎంపికైన చిన్నహోతూరు విద్యార్థులు వీరే

వజ్రకరూరు: మండలంలోని చిన్న హోతూరు జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు ఆర్. వీణ (7వ తరగతి), సి.అనిత (8వ తరగతి), ఆర్.భార్గవి (9వ తరగతి) రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక అయ్యారు. జిల్లా స్థాయి ఏపీ స్కూల్ గేమ్స్ అండర్ -14 ఖోఖో పోటీల్లో పాల్గొని ఈనెల 7,8,9 తేదీల్లో గుంటూరు జిల్లా కారంపూడిలో జరగనున్న పోటీలకు ఎంపికయ్యారు. సర్పంచులు బాల్యం సుంకులమ్మ, సురేంద్ర , హెచ్‌ఎం ప్రసాద్, పీడీ ప్రభాకర్, ఉపాధ్యాయులు అభినందించారు.

అంబేడ్కర్ గురుకుల పాఠశాల తనిఖీ



ప్రిన్సిపాల్‌తో మాట్లాడుతున్న ఎంపీపీ, ఈఓఆర్డీలు

ఉరవకొండ: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎస్సీ బాలికల గురుకుల పాఠశాలను శనివారం ఉరవకొండ ఎంపీపీ వెలిగొండ నరసింహులు, ఈఓఆర్డీ గౌస్‌సాహెబ్, మలేరియా సబ్‌యూనిట్ అధికారి భక్తుల కోదండరామిరెడ్డి, తల్లిదండ్రుల కమిటీ చైర్‌పర్సన్ పుష్పవతి, వైస్ చైర్మన్ మండ్ల చంద్రశేఖర్ శనివారం తనిఖీ చేశారు. ఎంపీపీ పాఠశాలలోని వంటగదితో పాటు భోజన నాణ్యతను పరిశీలించారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ జ్ఞానప్రసూనను ఉపాధ్యాయుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

వామ్మో..జాగ్రత్త!



» ఉరవకొండ పట్టణానికి చెందిన నేత కార్మికుడు గోపాల్ కుమారుడు తొమ్మిదేళ్ల శ్రావణ్‌ను వీధి కుక్క దాడి చేసింది. పాఠశాలకు వెళ్లి వస్తుండగా ఉన్నట్టుండి కుక్క దాడి చేయడంతో ఆ చిన్నారి భయాందోళనకు గురయ్యాడు. మరో రెండు రోజుల వ్యవధిలో గోపాల్ ద్విచక్రవాహనంపై వెళ్తుండగా వీధి కుక్క వెంటబడి దాడి చేసింది. ఒకే ఇంట్లో తండ్రీ కొడుకులపై కుక్కలు దాడి చేసి, గాయపరిచాయి.

» ఉరవకొండ పట్టణంలోని లత్తవరం రోడ్డు వద్ద ఇటీవల ప్రైవేట్ టీచర్ గౌతమి కూరగాయాలు తెచ్చుకునేందుకు వెళ్లింది. ఆ సమయంలో వీధి కుక్కలు వెంటబడి దాడి చేశాయి. దీంతో ఆమె తీవ్రంగా గాయపడింది. చికిత్స నిమిత్తం ఉరవకొండ ప్రభుత్వాస్పత్రిలో చేరింది. ఇలా నిత్యం ఏదో ఒక చోట కుక్కల దాడిలో గాయపడి, ఆస్పత్రి పాలవుతున్నారు.

- ఉరవకొండలో వీధి కుక్కల స్వైర విహారం
- ఈఏడాదిలో 1,223 కేసులు నమోదు
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులు



ఉరవకొండలోని గ్యాస్ గోడౌన్ సమీపంలో కుక్కల మంద

ఉరవకొండ: ఇళ్లలోకి అపరిచితులు ఎవరైనా రాకుండా..లేదా తెలియని వాళ్లు, దుండగులు ఎవరైనా చొరబడకుండా 'కుక్కలున్నాయ్.. జాగ్రత్త' అని బోర్డు పెట్టి, ముందు జాగ్రత్తగా యజమానులు హెచ్చరిస్తుంటారు.. పెంపుడు కుక్కలు ఇళ్ల వద్ద ఎవరైనా తచ్చాడుతుంటేనే అరవడం లేదా.. కరవడం చేస్తుంటాయి. అయితే ఉరవకొండ ప్రాంతంతోపాటు చుట్టు పక్కల గ్రామాల్లో వీధి కుక్కలు విచ్చలవిడిగా దాడి చేస్తున్నాయి. వీధుల్లో వెళ్లేవారిపైనా, ద్విచక్ర వాహనాల్లో వెళ్తున్నా, పశువులు, కోళ్లపైనా దాడి చేస్తున్నాయి. వెంటబడి మరీ దాడి చేస్తున్నాయి. చిన్నపిల్లలు, వృద్ధులు వీధుల్లోకి వెళ్లాలంటేనే ఏవైపు నుంచి కుక్కలు వచ్చి దాడి చేస్తాయోనని హడలెత్తిపోతున్నారు.

వ్యాక్సిన్ కోసం ఆస్పత్రులకు పరుగులు:

నిత్యం పదుల సంఖ్యలో జనం కుక్కల దాడిలో గాయపడుతున్నారు. ఈ ఏడాది వెయ్యికి పైగా కేసులు నమోదయ్యాయి. ఏదో ఒక గ్రామంలో కుక్కదాడిలో గాయపడి వ్యాక్సిన్ కోసం ప్రభుత్వాస్పత్రికి వెళ్లాల్సి వస్తోంది. అయితే ఉరవకొండ ప్రభుత్వ ఆస్పత్రిలో రేబిస్ వ్యాక్సిన్ కొరత ఉంది. దీంతో చుట్టు పక్కల ప్రాంతాల్లోని పీహెచ్‌సీలకు వెళ్లి వ్యాక్సిన్ వేయించుకోవాల్సి వస్తోంది.

ఉరవకొండలో ఈఏడాది జనవరి నుంచి అక్టోబర్ 20 వరకు నమోదైన కేసులు

నెల	కేసులు
జనవరి	153
ఫిబ్రవరి	120
మార్చి	120
ఏప్రిల్	131
మే	130
జూన్	129
జులై	130
ఆగస్టు	130
సెప్టెంబర్	91
అక్టోబర్	89
మొత్తం	1,223

చిన్న పిల్లలు వీధుల్లోకి వెళ్లడం లేదు



వీధి కుక్కల విచ్చలవిడిగా గుంపులు గుంపులుగా సంచరిస్తున్నాయి. పిల్లలను ఆడుకోవడానికి బయటకు పంపాలంటే భయమేస్తోంది. ఒక్కసారి గుంపులుగా వచ్చి దాడి చేస్తుండటంతో పిల్లలను బయటకు పంపాలంటే జంకుతున్నాం. అధికారులు వీధి కుక్కలను ఊరికి దూరంగా వదిలాలి.

– ఓబుళమ్మ, ఉరవకొండ

బైక్‌ల్లో వెళ్తే అంతే..



వారం రోజుల వ్యవధిలోని డ్రైవర్స్ కాలనీలో వీధి కుక్కల కాటుకు ముగ్గురు ఆసుపత్రి పాలయ్యారు. కుక్కలు ఒక్కసారిగా రాత్రి సమయంలో రోడ్డు మీద వెళ్లే వారిని టార్గెట్ చేస్తూ కుక్కలు దాడి చేస్తున్నాయి. ఒక ద్విచక్ర వాహనాల్లో వెళ్లే వారి పరిస్థితి దుర్భరంగా మారింది.

– దొకారి మంజుల, డ్రైవర్స్ కాలనీ, ఉరవకొండ

చర్యలు చేపడుతున్నాం



ఉరవకొండలో దాదాపు 25 వేల కుక్కలు ఉన్నట్లు గుర్తించాం. వీటిని నియంత్రించడానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. జనావాసాల మధ్య ఎక్కువ తిరిగే వాటిని గుర్తించి, వాటిని పట్టుకొని ఊరికి దూరంగా వదిలేసేలా చర్యలు తీసుకుంటున్నాం.

– గౌస్ సాహెబ్, ఈఓ, ఉరవకొండ

వ్యాక్సిన్ అందుబాటులో ఉంది



కుక్క కాటుకు అందించే రేబిస్ వ్యాక్సిన్‌ను సరిపడా అందుబాటులో ఉంచాం. చాలా మంది ఉరవకొండ నుంచి కూడా వ్యాక్సిన్ కోసం వస్తుంటారు. వారందరికీ వ్యాక్సిన్ అందించడంతో పాటు మాత్రలు (గుళికలు) అందించి పంపుతున్నాం.

– డాక్టర్ వెంకటేష్ నాయక్, వైద్యాధికారి, రాకెట్ల పీహెచ్‌సీ

5న నేడు డయల్ యువర్ డీఎం

రాయదుర్గంటౌన్: ఏపీఎస్ ఆర్టీసీ రాయదుర్గం డిపో పరిధిలో ఈ నెల 5న డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ కె.సురేష్ తెలిపారు. సాయంత్రం 4:30 గంటల నుంచి 5:30 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం జరుగుతుందన్నారు. ఆర్టీసీ రవాణా సౌకర్యాలు, సమస్యలు, సలహాలు, సూచనలపై సెల్: 99592 25863లో సంప్రదించాలని కోరారు. శ్రీశైలానికి ప్రత్యేక బస్సు సర్వీసు కార్తీక మాసాన్ని పురస్కరించుకుని రోజూ సాయంత్రం 4:45 గంటలకు శ్రీశైలం సర్వీసు నడుస్తుంది. దీంతోపాటు కార్తీక మాసం చివరి రోజు వరకు రోజూ సాయంత్రం 7 గంటలకు అనంతపురం మీదుగా శ్రీశైలానికి ఆర్టీసీ సర్వీసు నడపనున్నట్లు డీఎం సురేష్ తెలిపారు.

'మధ్యాహ్న భోజనం' అమలు చేయాలని ధర్నా



తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న విద్యార్థులు

రాయదుర్గంటౌన్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించి, విద్యార్థుల ఆకలి కేకలు తీర్చాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హనుమంతరాయుడు, కుళ్లాయిస్వామి డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని వేలాది మంది విద్యార్థులతో పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. జిల్లా ఏఐఎస్‌ఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడారు. అనంతరం వినతిపత్రాన్ని తహసీల్దార్ నాగరాజుకు అందజేశారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కోశాధికారి ఆంజనేయులు, జిల్లా ఉపాధ్యక్షుడు వంశీ, జిల్లా కార్యవర్గ సభ్యులు పవన్, నియోజకవర్గ అధ్యక్షుడుశశి, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

టిప్పర్, జేసీబీ సీజ్

డి హీరేహాళ్ (రాయదుర్గం): డీ హీరేహాళ్ మండలంలోని ఓబుళాపురం సమీపంలో శనివారం రాత్రి మట్టి తవ్వుతుండగా జేసీబీ, టిప్పర్‌ను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఈ వాహనాలు కర్ణాటక రాష్ట్రం ఆలకుంది గ్రామానికి చెందిన వన్నూర్‌స్వామివిగా గుర్తించామన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీకమాస పూజలు ప్రారంభం




నేమకల్లు అంజన్న, హటకేశ్వరస్వామి



బొమ్మనహాళ్‌లో పూజలు చేస్తున్న మహిళలు



వజ్రకరూరులోని జనార్దన వేంకటేశ్వరస్వామి

రాయదుర్గంటౌన్: పవిత్రమైన కార్తీకమాసం శనివారం నుంచి ప్రారంభం కావడంతో పట్టణంలోని శైవ క్షేత్రాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంటాయి. పట్టణంలోని శివాలయాలతోపాటు ప్రముఖ ఆలయాల్లో కార్తీకమాసోత్సవ పూజలు భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. పట్టణంలోని నగరేశ్వరస్వామి, జంబుకేశ్వరస్వామి, మార్కండేయస్వామి, చెన్నవీరస్వామి, నీలకంఠేశ్వరస్వామి ఆలయం, బసవేశ్వరస్వామి, వీరభద్రస్వామి, శంకరమఠం, చంద్రమౌళేశ్వరస్వామి, రేవణసిద్దేశ్వర, హటకేశ్వరస్వామి ఆలయాల్లో అర్చకులు పూజలు చేశారు.

వజ్రకరూరు: స్థానిక నగరేశ్వరస్వామి ఆలయంలో శనివారం కార్తీకమాస పూజలు ప్రారంభమయ్యాయి. ఆలయంలో తెల్లవారుజామున స్వామికి ప్రత్యేక పూజలతోపాటు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, అష్టోత్తర శతనామావళి, మహామంగళహారతి, తీర్థప్రసాద వినియోగం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భోగేశ్వరస్వామి, రామేశ్వరస్వామి ఆలయాల్లోనూ కార్తీక మాస పూజలు చేశారు. జరుట్లరామలింగేశ్వర స్వామి ఆలయంలోనూ పూజలు చేశారు.

బొమ్మనహాళ్: ప్రసిద్ధి చెందిన నేమకల్లు ఆంజనేయ స్వామి దేవాలయంలో మొదటి శనివారం కార్తీక మాసం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి మూలవిరాట్‌ను పట్టువస్త్రాలతో, పుష్పాలతో శోభాయమానంగా అలకరించారు. అర్చకుడు అనిల్‌కుమార్‌స్వామి ఆధ్వర్యంలో పురోహితులు వేకువజాము నుంచే స్వామికి కుంకుమార్చన, పంచామృతాభిషేకం, ఆకుపూజ చేశారు. కర్ణాటక, ఆంధ్రా ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు వచ్చి స్వామిని దర్శించుకున్నారు.

కూడేరు: మండల కేంద్రం ఆంజనేయ స్వామి ఆలయంలో కార్తీక మాసం తొలి శనివారాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులు ఆకు పూజ కట్టించి, మొక్కులు తీర్చుకున్నారు. ఆంజనేయ స్వామి నామస్మరణ మార్మోగింది. అర్చకులు తీర్థ ప్రసాదాలు అందించారు.

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని ఆలయాల్లో కార్తీకమాసం మొదటి శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి కార్తీకపూజలు చేశారు.

సీతారామస్వామి ఆలయంలో పూజలు

వజ్రకరూరు: స్థానిక బలిజవీధిలోని సీతారామస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం విశేష పూజలు నిర్వహించారు. ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలతోపాటు అర్చనలు, విశేష పూజలు, మంగళహారతి, తీర్థప్రసాద వినియోగం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. స్థానికులతోపాటు భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకొని స్వామిని దర్శించుకున్నారు. జనార్దన వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అపార్ వందశాతం నమోదు కావాలి



మాట్లాడుతున్న డివిజనల్ విద్యాశాఖాధికారి శ్రీనివాసరావు

కూడేరు: అపార్ కార్డు నమోదుపై అలసత్వం తగదని డివిజనల్ విద్యాశాఖ అధికారి (డీవైఈఓ) శ్రీనివాసరావు ప్రధానోపాధ్యాయులకు సూచించారు. శనివారం ఆయన కూడేరులోని ఎమ్మార్సీని తనిఖీ చేశారు. ఎంఈఓలు 1,2 మహమ్మద్ గౌస్, సాయికృష్ణతో అపార్‌కార్డు నమోదుపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన గూగుల్ మీట్ ద్వారా ప్రధానోపాధ్యాయులతో మాట్లాడారు. టెక్నికల్ సమస్యలు తలెత్తినా, సందేహాలు ఉన్నా ఎమ్మార్సీలో కంప్యూటర్ ఆపరేటర్ల ద్వారా నివృత్తి చేసుకొని నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు.

ఘనంగా వాల్మీకి జయంతి



గ్రామోత్సవంలో పాల్గొన్న వాల్మీకులు

బ్రహ్మసముద్రం :మండంలోని పడమటి కోడిపల్లిలో వాల్మీకి జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో ఏర్పాటు చేసుకున్న వాల్మీకి మహర్షి విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం వాల్మీకి కుల బంధువుల ఆధ్వర్యంలో డప్పు వాయిద్యాలు నడుమ నృత్యాలు చేస్తూ వాల్మీకి చిత్ర పటాన్ని గ్రామంలో ఊరేగించారు.

ఎర్రగుడిలో వాల్మీకి జయంతి

బెళుగుప్ప: మండల పరిధిలోని ఎర్రగుడిలో శనివారం వాల్మీకి జయంతి వేడుకలు నిర్వహించారు. వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి,పూజలు చేశారు. అనంతరం వాల్మీకి చిత్రపటాన్ని ట్రాక్టర్‌లో ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

రాయదుర్గం: కర్ణాటక రాష్ట్రం నుంచి అక్రమంగా మద్యం రవాణా చేస్తూ ఇద్దరు వ్యక్తులు పట్టుబడినట్లు ఎక్సైజ్ సీఐ సోమశేఖర్ తెలిపారు. శనివారం అనంతపురం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, స్థానిక ఎక్సైజ్ పోలీసులు సంయుక్తంగా జరిపిన దాడుల్లో ఆయతపల్లి వద్ద ద్విచక్ర వాహనంపై 82 కర్ణాటక టెట్రా పాకెట్లు తరలిస్తూ పట్టుబడ్డారు. బొమ్మక్కపల్లి గ్రామంలో 84 కర్ణాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్‌ఐలు అన్నపూర్ణ, హరికృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ పంపిణీ అస్తవ్యస్తం

- రాయదుర్గంలో నేటికీ తెరచుకోని చౌక దుకాణాలు
- బియ్యం డబ్బా తూకాలతో డీలర్ల చేతివాటం
- రేషన్ పంపిణీ వాహనాలకు సరుకులు ఇవ్వని డీలర్లు
- కార్డుదారులకు సరుకులు అందక అవస్థలు



13వ వార్డులోని ఎఫ్‌పీ షాపులో డబ్బాతో తూకం వేస్తున్న దృశ్యం



28వ వార్డు పరిధిలోని స్టోరును 5వ తేదీ తెరవబడును అని నోటీసు అంటించిన స్టోరు డీలరు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని చౌకధాన్యపు డిపోల్లో నిత్యావసర సరుకుల పంపిణీ అస్తవ్యస్తంగా మారింది. డీలర్లు ఎప్పుడు అందుబాటులో ఉంటారో తెలియని అయోమయ పరిస్థితి. రేషన్ అందక ఇబ్బందులు పడుతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతినెలా ఠంచన్‌గా ఒకటోతేదీ రాగానే ఇంటి వద్దనే ఎండీయూ వాహనాల ద్వారా నిత్యావసర సరుకులు పంపిణీ చేసేవారు. ప్రస్తుతం రేషన్ కోసం లబ్ధిదారులు స్టోర్ల వద్దకు వెళ్లి క్యూకట్టాలి వస్తోంది. మరోవైపు బియ్యం డబ్బా తూకాలతో డీలర్లు మోసాలకు పాల్పడుతూ బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్నారు. ఇంటింటికీ రేషన్ పంపిణీ వాహనాలకు సరుకులు ఇవ్వాలని ఏకంగా తహసీల్దార్ డీలర్లను ఆదేశించినా, అమలు కాలేదు.

రాయదుర్గం పట్టణంలో 23 చౌక ధాన్యపు డిపోలు ఉన్నాయి. వీటిలో సగానికిపైగా స్టోర్లు నేటికీ తెరవలేదు. దీంతో లబ్ధిదారులు సరుకుల కోసం పడిగాపులు కాయాల్సి వస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన మరుసటి నెల నుంచి సగానికిపైగా పాత డీలర్లపై తీవ్ర రాజకీయ ఒత్తిడితో వారిని తొలగించి, టీడీపీ నాయకులు, కార్యకర్తలకు కట్టబెట్టారు. పట్టణంలోని 11 ఇంటింటికీ రేషన్ వాహనాలను నిలిపివేశారు. స్టోర్లలో బియ్యం పంపిణీ చేయాలంటే కచ్చితంగా ఎండియూ ఆపరేటర్ థంబ్ (బొటనవేలు ప్రింట్) తీసుకోవాలి. దీంతో బయోమెట్రిక్‌లో సమస్య నెలకొంది. పట్టణంలోని ఒక్కో ఎండీయూ వాహనం ఆపరేటర్ పరిధిలో రెండు చౌకధాన్యపు డిపో పరిధిలోని లబ్ధిదారులకు సరుకులు అందించాల్సి ఉంటుంది. ఒకేసారి ఎండీయూ ఆపరేటర్ రెండు స్టోర్లకు థంబ్ ఇవ్వలేడు.దీంతో ఒక స్టోరులో ఐదారు రోజులు వేసిన సరుకులు వేసిన తర్వాత మరో స్టోరులో వేస్తున్నారు. దాదాపు సగం స్టోర్లలో వారంరోజుల తర్వాత సరుకులు వేస్తున్న పరిస్థితి. క్షేత్రస్థాయిలో స్టోర్లను తెరవక సరుకులు పంపిణీ చేయని విషయం అధికారులకు తెలిసినా చూసీ చూడనట్లు వ్యవహరిస్తుండడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

డబ్బా తూకాలతో మోసం..

డబ్బా తూకాలతో బియ్యం పంపిణీలో డీలర్లు చేతివాటం ప్రదర్శిస్తూ కార్డుదారులను మోసం చేస్తున్నారు. ఎలక్ట్రానిక్ మిషన్లలో నేరుగా లబ్ధిదారులు తెచ్చిన సంచుల్లో కాకుండా అందుకు విరుద్ధంగా డబ్బాల్లో బియ్యం వేసి తక్కువ తూకంతో బియ్యం మిగుల్చుకుంటున్నారు. బియ్యం తూకాల్లో మోసం చేస్తూ 10 కేజీలకు 2 కేజీ బియ్యం కాజేస్తున్నారు. మిషన్‌పై డబ్బా పెట్టినా దాన్ని జీరో చేయకుండా నేరుగా తూకం వేస్తూ చేతివాటం ప్రదర్శిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో డీలర్లు ఇష్టారాజ్యంగా బియ్యం తూకాల్లో గోల్‌మాల్ చేస్తూ పేదల బియ్యాన్ని నొక్కుతున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు కన్నెత్తి చూడకపోవడంపై సర్వత్రా అసంతృప్తి వ్యక్తమవుతోంది.

రేషన్ ఇంకా తీసుకోలేదు



చౌక ధాన్యపు డిపో ఎప్పుడు తీస్తారో అర్థం కాని పరిస్థితి. 14వ వార్డు పరిధిలోని స్టోరుకు వెళితే 5వ తేదీ నుంచి సరుకులు వేస్తామని చెబుతున్నారు. ఇంటింటికీ రేషన్ వాహనాలు ఉంటే ఒకటోతేదీ నుంచి సరుకులు తీసుకునే సౌకర్యం ఉండేది. అంతేకాక దాదాపు కిలో మీటరుకు పైగా దూరం వెళ్లి సరుకులు తీసుకురావాల్సి వస్తోంది.

– దీప్తి, ఇందిరమ్మ కాలనీ, భంభంస్వామి లేవుట్, రాయదుర్గం

విచారించి చర్యలు తీసుకుంటాం



సరుకులను ఇంటింటికీ రేషన్ వాహనాలకు ఇవ్వాలని ఇది వరకే డీలర్లను ఆదేశించాం. ఎట్టి పరిస్థితుల్లో డబ్బాలతో తూకం వేయరాదు. బియ్యం తూకంలో తక్కువ వచ్చినట్లు ఎవరి నుంచైనా ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటాం. స్టోర్లు బంద్ చేసిన విషయంపై కూడా తనిఖీ చేస్తాం. చౌకధాన్యపు డిపోలను క్షేత్రస్థాయిలో తనిఖీలు చేసి, పేదలు నష్టపోకుండా చూస్తాం. ఎవరైనా డీలర్లు మోసాలకు పాల్పడితే విచారించి చర్యలు చేపడుతాం.

– నాగరాజు, తహసీల్దార్, రాయదుర్గం

సంక్షిప్త సమాచారం

కేటాయింపు మేరకు కూలి వర్తింపు

కూడేరు: ఉపాధి హామీ పథకం ద్వారా కల్పించే పనులను నిబంధనల మేరకు నాణ్యతగా చేస్తే కేటాయింపు మేరకు కూలి వర్తింపజేస్తారని ఎంపీడీఓ కుళ్లాయిస్వామి కూలీలకు తెలియజేశారు. శనివారం అరవకూరులో ఉపాధి పనులపై గ్రామసభ నిర్వహించారు. ఎంపీడీఓ కుళ్లాయి స్వామి ఉపాధి పనులపై కూలీలకు, రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీఓ తులసీ ప్రసాద్, టెక్నికల్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ, ఫీల్డ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

బ్రహ్మసముద్రం : మండలంలోని గుండిగానిపల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీలో వర్షపు నీరు నిల్వ ఉండటంతో ప్రజలు ఇబ్బది పడుతున్నామని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఇటీవల కాలనీవాసులు ఫిర్యాదు చేశారు. దీంతో హౌసింగ్ పీడీ శైలజ శనివారం గుండిగానిపల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీకి వెళ్లి పరిశీలించారు. సమస్యలపై ఆరా తీశారు. సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ రామ్మోహన్, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ యుగంధర్, పంచాయతీ కార్యదర్శి మైలారి , సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

బెళుగుప్ప: నక్కలపల్లి గ్రామానికి చెందిన ఎల్‌కే మల్లికార్జునరెడ్డి (53) కనిపించలేదని ఫిర్యాదు అందినట్లు ఎస్‌ఐ శివ శనివారం తెలిపారు. కొన్నిరోజులుగా తన తండ్రి కనిపించలేదని మల్లికార్జునరెడ్డి కొడుకు నాగేశ్వరరెడ్డి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ప్రమాదకరంగా మారిన కేబుల్ గుంతలు

కంబదూరు : కళ్యాణదుర్గం నుంచి కంబదూరు మీదుగా ప్రధాన రోడ్డు పక్కన జరుగుతున్న కేబుల్ లైన్ తవ్వకాలతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. శనివారం రాత్రి బెంగళూరుకు చెందిన కొందరు శుభకార్యానికి కారులో కంబదూరుగా మీదుగా రాయదుర్గానికి వెళ్తుండగా కదిరిదేవరపల్లి సమీపంలో ఎదురుగా వచ్చిన వాహనాన్ని తప్పించబోయి మట్టిదిబ్బపైకి దూసుకెళ్లింది. అయితే డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో పెనుప్రమాదం తప్పింది.

పెన్నహోబిలం నూతన రథం పరిశీలన

ఉరవకొండ: పుణ్యక్షేత్రం పెన్నహోబిలం లక్ష్మీనృసింహుడి నూతన రథం తయారీని కర్నూలు జోన్ దేవదాయ శాఖ డిప్యూటీ ఇంజనీర్ ప్రసాద్ శనివారం పరిశీలించారు. అలయ ఈఓ రమేష్‌బాబు మాట్లాడారు. కాంట్రాక్టర్.. రథం చక్రాల తయారీలో నాసిరకం చెక్కను వినియోగించినట్లు తెలిపారు.

అభ్యంతరాలు తెలపండి

బెళుగుప్ప: మండలంలోని శీర్పి, శ్రీరంగాపురం, గంగవరం గ్రామాల్లోని మైనర్ ఇరిగేషన్ చెరువుల కింద ఉన్న సాగునీటి సంఘాల్లో రైతుల జాబితాలపై అభ్యంతరాలను తెలియజేయాలని తహసీల్దార్ షర్మిళ తెలిపారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు.

భూ సమస్యలను పరిష్కరిస్తాం

కళ్యాణదుర్గం రూరల్: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన వినతులను పరిష్కరిస్తామని తహసీల్దార్ భాస్కర్ తెలిపారు. శనివారం మండలంలోని కామక్కపల్లి గ్రామంలోని భూ సమస్యపై ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించారు.

విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయాలి

ఉరవకొండ: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారని, విద్యాహక్కు చట్టం పక్కాగా అమలు చేసి పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య అందేలా కృషి చేశారని, కూటమి ప్రభుత్వం విద్యాహక్కు చట్టాన్ని నిర్వీర్యం చేస్తోందని జీవీఎస్‌ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాకే పురుషోత్తం, ఆర్‌ఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి చిరంజీవి అన్నారు. శనివారం మండల విద్యాశాఖ అధికారి ఈశ్వరప్పకు విద్యార్థి సంఘం నేతలు వినతి పత్రం అందించారు.

విద్యుత్‌షాక్‌కు గురై వ్యక్తికి గాయాలు

కూడేరు: చోళసముద్రానికి చెందిన చిత్రా శివ అనే వ్యక్తి విద్యుత్‌షాక్‌కు గురై తీవ్రంగా గాయపడ్డాడు. ప్రైవేట్ విద్యుత్ హెల్పర్ అయిన శివ.. స్థానికంగా ఓ రైతు పొలంలో విద్యుత్ స్తంభం ఎక్కి మరమ్మతు చేస్తుండగా షాక్‌కు గురయ్యాడు. గాయపడిన అతన్ని చికిత్స నిమిత్తం అనంతపురం ఆస్పత్రికి తరలించారు.